# మట్టి తీగలు

“...వేటగాని మెత్తనితనం చూసి లేడి మూడు గెంతులేసిందని... ఈ మగ మనిషిల నాడింలేకగాని... ఏమి? ‘ఓరయ్య నువ్వింట్ల వుండురా’ అంటే వుండడా? ఒక్క రవ్వ ఆసరాగుంటే మేమెక్కడ బతికిపోతామో? కొడుకెక్కడ బాగుపడిపోయి పెద్దోడయిపోతాడోననీసి కూతిరింట్లో కూకోని కణికలు తినడానికి పోనాడీ ముసిలోడు.... తక్కువింటోడు కాదు...”

గొలకనకోడిలాగా పొద్దుట్నుంచి గొలుకుతూ గోల చేస్తూనే వుంది నరసమ్మ.

పెరడ్లో పెనక కింద మట్టి అరుగు మీద కూర్చున్న ముసలి తవిటయ్య ఆ మాటల్ని వింటూ విననట్టే పెదవయినా కదపలేదు. తన ముందులున్న గిన్నెలోని పకాలన్నం కలిపిందే కలుపుతున్నాడు తప్ప నోరు మెదపలేదు.

నరసమ్మ యింట్లోకి వెళ్ళి వచ్చి తవిటయ్యా చేతిలో నాలుగు పిండొడేలు పెట్టింది. మరో చేత్తో పట్టుకు వచ్చిన ఎర్రవుళ్ళిపాయకి తొక్కతీస్తూ... “ఎవులు పెళ్ళాం పిల్లల్తోటి ఆలు బతికీసరికే సరి, మాకు తప్పలేదు లంపాటకం.. మా పీక్కి కన్నితగులుకుంది. ఇరుక్కున్నాం. అయినా బూములిచ్చే? బవంతులిచ్చే? అన్నీ ఇచ్చినోలుకే తన్ని తగిలేస్తున్నారు గదా...?” అంటూనే ఆ పాయిల్ని గెంజిగిన్నెలో వేసింది.

“ఏటివా... నరసమ్మోదినా మీ మామతోటి తగలతన్నావు? ముందుగాలాన లేని బూములూ, బవంతులూ, ఆస్తులూ, పాస్తులూ సచ్చీగాలన ఆ ముసిలోడికి ఎక్కడ్నుంచొస్తాయే? ఏటివ్వలేదని దెబ్బలాడతన్నావు. ఆడిదగ్గరున్నాది కట్ట... ఇదే నా కోడలా లెక్కెట్టుకోయే అని ఇచ్చీడేల?!” సన్నాసమ్మ అరుగు దిగువ - పెండి అవతలవార్ననిలబడి, వానకి తడిసిన కర్ర పుల్లల్ని ఎండబెడుతూ అడిగింది.

నరసమ్మ తగువుకి దిగొచ్చినట్టు ముంజూరివతలకొచ్చి “కట్లడిగిన దాన్నయితే కాసులపేరులడిగిన దాన్నయితే ఇలగ ఈది గుమ్మమెక్కిపోను... తలెంట్రుకల్తోటి పీకలు కోసీడం

నాకు తెల్దు, వున్నది కుండ బద్దలు గొట్టినట్టు పేలీడమే.. ఏమి నీకంటితోటి చూస్తన్నావు గదా... నేసియింటికి కాపురానికొచ్చి పాతికేలు. ఈ యిల్లు నిలబెట్టడానికి ఎన్ని రయిపాయాలు పడ్డానో నీకు తెల్దా? అలాటిది నా పెనిమిటిని ఈ ముసిలోడు కనలేదే? మారటోడే నా మొగుడు? ఏమి కొడుకింట్ల వుండి చెయ్యిసాయమయితే అదెంత ఇలువ? గవురుము?...'' అడిగింది.

సన్నాసమ్మ ఏదో అనబోయి అనలేక 'ఆమాటా నిజమే' అన్నట్టు తలాడించింది. నరసమ్మ వేగపోవడంతో సన్నాసమ్మ ఆగింది.

'... ఆస్తులడగడానికి నీనేమి బాగార్నా? బైపోతునా? అరవసేకరి చెయ్యడానికొచ్చిన యింటి కోడల్ని గాని అక్కుదారిని కాను. వుంటే ఆడికొడుకు... కొడుకు పిల్లలు... ఆడి వంశమే తింటాది. లేదూ ముష్టెత్తుకుంటాది... మద్దిన నీనేల గుండయిపోయి పిండయిపోడం? ఈదిలబడిపోడం?...' వేగస నరసమ్మ మరేం గుర్తుకొచ్చోగాని నిష్టురపడుతూ కళ్ళలో నీళ్ళు తిప్పుకొంది. పైటతో రెప్పల్ని ఒత్తుకొని పెండివార లేచిన బీరపాదుల్ని తడిమి, దాని లేత తీగల్ని అతిసున్నితంగా ఎత్తి పాకడానికి అనువుగా ఎండుపుల్లల్ని పెట్టి ఆసరా ఇచ్చింది.

సన్నాసమ్మ తన చూపుని నరసమ్మ మీదుగా ముసిలోడి మీదకి తిప్పింది. ముసిలోడు ఒక అరచేతిమీద తలవాల్చి, మరో చేతిని గిన్నెలో వూరేసినట్టు వదిలాడు. అతని కళ్ళ వెంట జలజలరాలిన కన్నీటి చుక్కలు గెంజిలో కలిసినా చప్పుడు చెయ్యలేదు. సన్నాసమ్మ కంటికా దృశ్యం అందకపోయినా మనసుకేదో చేరి దొలిచింది.

'అయినా... నరసా... ఆడి కూతురెవులే? నీ యింటి ఆడపిల్లే కదా? పెనిమిటి పోయిన పిల్లకి తోడెళ్ళినాడు నీమామ...' సన్నాసమ్మ మాటని నరసమ్మ పూర్తి చెయ్యనివ్వలేదు. వంచిన నడుమెత్తి నిలబడి... "వద్దని నీననలేదమ్మా... ఆల ఆసలు నీనేమి తీసీలేదు. కట్నమంతే కలిగినకాడకి ఇచ్చినాం. ఆ బగమంతుడు బద్దలైపోయిన బగమంతుడు నుదిటిమీద రాతకి పోటు లేదని దాని బొట్టు చెరిపీసినాడు. బతుకు చెరిపీలేమన్చెప్పి చేరదీసి బడ్డీ కొట్టు ఎట్టుకుంటామంటే నాలుగేలో అయిదేలో యిచ్చినాం. ముసిలోడ్నీ వుంచినాం. ఒక్కగానొక్క ఆడపిల్ల పెళ్ళిచేసి ఆ బరువూ దించుకుంది మా వదిన. ఇల్లరికం అల్లుడూ మగదిక్కూ అయినాడుగదా... యింకా సచ్చీదాక సావలమోత తప్పనట్టు నిన్నటిదాక ముసిలోడ్ని వుంచుకున్నావ్..."

"బావనీ అన్నొస్తండు.." సన్నాసమ్మ తిరపతిని చూసి నరసమ్మకు చెప్పింది.

"రానీ... రానీ ఇందల రహస్సిమేటీ లేదు. అయినా మీ అన్న ఇనేటిసుకము? ఇనకేటి సుకము? ఈ చెవ్వంట విని ఆ చెవ్వంట వదిలేస్తాడు..." నరసమ్మ అంటుండగ తిరపతి పెరట్లోకి వచ్చాడు. ఆ మాటా విన్నాడు.

"సీకికన తెల్లారిందే?!" అన్నాడు భార్యతో తిరపతి. అతని మాటలో విసుగు తప్ప మరో ధ్వని లేదు.

''తెల్లారదా?... నువ్వయితే మెత్తని సొత్తిబద్దవు... నేనయితే రంపల రాకాసిని... అరుసుకోనుండకపోతే తిన్నిది ఎలగ జీర్ణమవుతాది?... కాలు మీద రోలు ఏసుకొని కూకుంటే తిన్నిదెలగరుగుతాది?..'' నరసమ్మకు మళ్ళీ అగ్గంటుకుంది.

తిరపతి జవాబివ్వలే, తలపట్టుకు గోక్కున్నాడు.

''... ఏరుదాకొస్తే కడుపు గుప్ మందట. అలాగ యిక్కడికొచ్చీ సరికే అన్ని రోగాలున్నూ... ముసిలోడికిప్పుడు కళ్ళవుపడవు. కట్టలున్నాయి గలా ఆపరేషను చేయించీమని మా వదిన పంపీసింది... ఈ ముసిలోడూ వచ్చీసినాడు...'' అంది నరసమ్మ. ముసిలోడికి చెవుడు లేకపోయినా వినాలని గట్టిగానే అంది.

''... మాకూ నలుగురు పిల్లలు. ఆడపిల్లలు కారు. పెళ్ళీ పేరంటాలు చెయ్యక్కర్లేదు, కాని ఆలకొక దారి చూపించాలా వద్దా? తాతలిచ్చిన ఆస్తిపాస్తులున్నాయా? పిల్లొంకోలు పిన్నమ్మగోరు... బేపొంకాలు పెద్దమ్మగోరు ఎవరున్నారు చూస్తారు? పోనీ చదువులయినా చదివిద్దుమంటే అంతసెత్తిలేదు. పెద్దోలిద్దర్ని పదితోటే ఆపీసి పన్లో పెట్టీసినాం. మిగతా చిన్నోలిద్దర్నయినా అంతదాక పెద్దోలంతదాక చదివించొద్దా?.... ఈడ్చుకురావద్దా?... ఆలుసురు ఎలాగ పోసుకుంటాము?...'' ఎవర్నో అడుగుతున్నట్టు కాక, తనకి తనే చెప్పుకుంటున్నట్టుగా అంది నరసమ్మ. ఆమె కన్నీటి తడి ఆరిపోయింది.

ఎప్పుడూ వున్న సొదేననో, తనిక వెళ్ళాలనో ''అన్నా పన్లోకి ఎల్లలేదురా?'' అడిగింది సన్నాసమ్మ.

''జూటు మిల్లు సంగతి తెల్దే? సంవచ్చరానికి ఆరు మాసాలు మూతే. ఏటి బతికేది? ఎలాగ బతికేది? మరింక కంచంల కొండొచ్చి ఏటి పడిపోతాది? తినేసి బతికేస్తాము?...'' నరసమ్మ జవాబివ్వడంతో తిరపతి ఏమీ మాటాడలేదు.

ముసలి తవిటయ్య తలెత్తి అంతలోనే ఎవరి కళ్ళలోకి చూసే ధైర్యం చాలక తలదించుకున్నాడు.

''ఇయ్యాల మాం ముసిలోడ్ని తిట్టినట్టే రేపు మా పిల్లలూ మమ్మల్ని వదిలీరు, తిడతారా? తిట్టిపోస్తారు! గోనితోటివి గొద్దులు... ఆకుతోటివి బెల్లమూ మా అత్తామామ గడించేసినారు అని వచ్చినమ్మ కూతురూ అబ్బేడు వంశాలకి తిట్టిపోస్తాది... మాన్తాదా?...'' అనేసి నరసమ్మ యింట్లోకి వెళ్ళిపోయింది.

'వస్తాన్రయ్యా' అని సన్నాసమ్మ వెళ్ళాక, తిరపతి యింట్లోకి వెళుతూ తండ్రి దగ్గర ఒక్క క్షణం ఆగాడు.

కొడుకెక్కడ బాధపడతాడోనని తవిటయ్య గెంజెత్తు బెట్టుకొని తాగాడు. ఉల్లిపాయ కొరుక్కున్నాడు. మరొక ముద్ద పెట్టి పిండొడింని అపురూపంగా రవ్వల్ని చేసి నాలిక మీద పెట్టుకొని చప్పరించాడు. కొడుకెదురుగా నిల్చున్నాడనుకొని గిన్నె ఖాళీ చేసాడు. చూస్తే కంటికేమీ కనిపించేలేదు, తన చత్వారాన్ని తిట్టుకున్నాడు.

నరసమ్మ ఎంగిలి కంచాన్ని తీసాక కడిగి బోర్లించి, ఆ తర్వాత మామని - ద్వారబందాలు గద్దుకుంటాడేమోనని చెయ్యి పట్టి తెచ్చి యింట్లో కూర్చోబెట్టింది. ఎవరో కొత్త కోడలొచ్చిందని తెచ్చిపెట్టిన సలిబిండి ముద్దని ముసలోడి చేతిలో పెట్టింది.

ముసలి తవిటయ్య సలిబిండిని నోట్లో పెట్టుకుంటే నాలిక తియ్యగానే కాదు. చురుక్కుమనీ అంది. నాలుకతో అంగుటికెత్తి తడిమాడు. చిటుకూ చిటుకూ మనిపిస్తున్నవి చీమలని గ్రహించాడు. ఉయ్యబోయి... చిన్నప్పటి ఎప్పటి అమ్మ మాటో గుర్తొచ్చి "సీమలు తింతే కళ్ళువుపడతాయిరా"... తలచుకొని-చేదుదైనా మందైతే మిగినట్టు మింగాడు. అగ్గి మింగినట్టు అనిపించింది.

చీమలున్నాయి దులుపుకొని తినమన్న నరసమ్మ మాట ఆయనకు వినిపించలేదు. అలాగే గోడకు చేరగిలబడ్డాడు తవిటయ్య. చిన్న మబ్బు పట్టింది.

సూరీడు కొద్దీగ నెత్తి ధ్దిగీసరికి-

కారుమబ్బు గాలికి విడిపోయినట్టు కునుకు మబ్బు గోలకి తేలిపోయింది. తవిటయ్య కళ్ళకు కనిపించనంత స్పష్టంగా చెవులకు వినిపిస్తున్నాయి.

"... ఊరుదుక్కు చూసి ఉడుత గుడ్లు పెట్టిందాట... నీ మెత్తనితనం చూసే నీయప్ప ఇలాగ చేసింది. కళ్ళువుపించినన్నాళూ బడ్డీ దిగనిచ్చింది కాదు, ఇవాళ కళ్ళువుపించకపోయిసరికి మనమవుపించినాం. తోలీసింది. ఇప్పుడికే అప్పులపుప్పయిపోయినాం. అప్పులోడికి ఆతులు పరమేశ్వరుడికి సేతులిచ్చీసి నిలబడిపోనాం. మరి నీకేటి చెయ్యడానికుందో అదేచెయ్యి..."

నరసమ్మ మాటకి తిరపతి ఊ అనలేదు. ఆ అనలేదు.

కొద్దిసేపాగి నరసమ్మే అంది.

"నువ్వు ఉఋగులూ అనకపోతే... జుఋగులూ అనకపోతే ఏటనుకుండీది? అందిన కాడల్లా అప్పులు చేస్సినాను. నాకెక్కడ దమ్మిడీ పుట్టదు. అప్పుడలగే మా అయ్యని తెచ్చేస్తన్నాను బడ్డీ కొట్టెట్టెస్తన్నామనీ సరికి- నమ్మినానబోసీసరికి కుమ్మికుడుము లెట్టీడమయిపోయింది. 'వొదినా...... నీదొకిల్లు...... నాదొకిల్లా? ఏయింటి నుండి వచ్చినానో ఆ యిల్లు మరిసిపోతానా? అనీసి-మీ యప్ప-మావదిని-నిచ్చిన లేకుండా అట్టుగెక్కించీసింది......బుల్లారి బుచ్చిని పొంగిపోయి బూరయిపోన్ను."

జరగకూడనిది జరిగినట్టు నరసమ్మ ఎక్కలాక్కోవడం చూసి 'ఇప్పుడేటయిందే?' తిరపతి విసుక్కున్నాడు.

"పిడుగు పడినా కూకున్నకాడినుండి లెగవు. ఇంకేటవాలో? ఏమి చెప్పలేవా? మీ యప్పింటికి దిగబెట్టీలేవా? ముసిలోడు కష్టం తిన్నాది కళ్ళాపరేషనుకి పెట్టలేదా? మనమేనికి పెడతాము? అయినా వుంటే పెట్టేద్దుము. యింట్లో తల్లి నలుగురం పనిలో కెళ్తేనే నాలుగేళ్ళు నోట్లోకి పోతన్నాయి. ఇన్నాళ్లాటి రోజులా? ఒక్కడి రెక్కల కష్టం కింద బతికీరోజులు పోనాయి.."

నరసమ్మ అంటూనే వుంది. మాటలే వూపిరాదుల్తోంది. తిరపతి లేచి బయటకు వీధిలోకి వెళ్ళిపోయాడు.

నరసమ్మ మొగుడ్ని తిట్టింది. అదే వూపు మీద బడిలోంచి వచ్చిన పిల్లలు పుస్తకాలూ ఫీజులంటే అంతెత్తు లేచి తిట్టిపోసింది.

పొయ్యిలోని అగ్గి దూకు మీదుండి నివురుగప్పి వున్నా- గాలితగిలి రేగి రాజుకున్నట్టు ఆయిల్లు రాజుకుంటూనే వుంది.

ఆ రాత్రి నిద్రపట్టని తవిటయ్యకు- కళ్ళకు ఖర్చూ- వేరేతమలో మనిషిని బడ్డీలో పెడితే నెలసరి ఆదాయంపోయి ఆ ఖర్చూ లెక్కలు గట్టి- ఆపరేషనుకు అప్పుపుట్టక- మళ్ళీ మొదటికొచ్చి అప్పగారింటికి తిరిగి దిగబెడతానని తిరపతి 'మాటివ్వడం'- చెవులు వద్దన్నా మోసుకొచ్చాయి.

మర్నాడు పొద్దున్నే లేస్తూనే "నాను బయలెల్తాను" అన్నాడు తవిటయ్య. తిరపతికి ముందు బోధ పడలేదు. నరసమ్మకు అర్థమయినా ఆగింది. 'ఎక్కడికి తాతా'? అని అడిగారు చిన్నమనమలిద్దరూ.

"పిల్లొక్కదాయి. వదిలేసి వచ్చేన్ను, ఎలాగుందో....... ఏటో ఎద్దో......? నానెల్తె ఒకరవ్వ సాయం...." తవిటయ్య కూతురింటికి వెళ్తున్న విషయం చెప్పాడు.

అల్లుడూ కూతురంటే కొత్తగా పెళ్ళయినోళ్ళని, వాళ్ళ నేటి నమ్మీదని సంజాయిషీ ఇచ్చాడు.

"... దిగబెట్టీమంటాడు, అనడా? కొడుకేటి చూసినాడు. గతిలేని కొడుకింట్ల ఏలుంటాడు? కూతిరింట్ల కణికలు కాల్చీసి పెడతారు. పెద్దోడివయితే తర్వాత దండమెట్టొచ్చును గాని, మరి నా నోరు తిన్నగరాదు..." నరసమ్మ ఏదో చెయ్య జారిపోయినట్టు, చేతికొచ్చినా పనికిరానట్టూ ఉక్రోషం పట్టకుండా వుంది.

తవిటయ్య ఏదో తప్పు చేసినట్టు, తన కొడుకు కుటుంబానికి తీరని అన్యాయం చేసినట్టు, దిద్దుకోలేని తప్పు జరిగినట్టు తలదించుకున్నాడు.

కొద్దిసేపటికి తేరుకొని 'నానెల్తాను మరి, పిల్లలు జాకర్త' అని గుమ్మం దిగుతున్న తవిటయ్యను ఆగమని 'చేర్జీలకు డబ్బులియ్యి' అని భర్తను కేకలేసింది నరసమ్మ.

తిరపతి జేబులన్నీ వెతికి ముప్పైరూపాయలు తండ్రి చేతిలో పెట్టాడు. సరిపోవన్చెప్పి నరసమ్మ తన గైనం తెరిచి పదహారు మడతలతో వున్న ఇరవై రూపాయల నోటు విప్పి మామ చేతిలో పెట్టింది. తవిటయ్య ఆ డబ్బుల్ని తిరిగి మనమల చేతిలో పెట్టబేతే వారు అందుకోకుండా ఆమడదూరం పరిగెత్తారు.

మందులకో మాకులకో అవుతాయని, వుండనియ్యమని నరసమ్మ కేకలేసింది. లేక దరిద్రంగాని వుంటే పెట్టడానికేం రోగమంది. పదేళ్ళ ఆఖరి చిన్న కొడుకుని తోడిచ్చి పంపింది. స్కూలుంది గనుక వాణ్ణి వెంటనే పంపించమని హెచ్చరించింది.

కూతురింట కాలు మోపేసరికి-

''వచ్చేనావా? మంచిపని చేసినావు, ఇవతల ఓడల వర్తకం పోతుంటే నువ్వెళ్ళి అక్కడెలా గుంటావులే...?!'' కూతురుదే ఆ మాట.

''యిక్కడెలాగున్నారోననీసీ...'' తవిటయ్య్ కూడబలుక్కున్నాడు.

''యిక్కడ సచ్చినాం, తలకొరివి పెట్టడానికి వచ్చీసినావు....'' కూతురు అమ్మాయమ్మ మాటతో తవిటయ్యకు నోరు పడిపోయినట్టు మాటరాలేదు. అలాగే కూర్చుండిపోయాడు వీధి పావంచాల మీద.

''ఏం రెండ్రోజులు వుండలేకపోయావా?'' మళ్ళీ అడిగింది అమ్మాయమ్మ. 'అమ్మెంత వుండమన్నా తాతయ్య వుండలేద'ని సాక్ష్యం చెప్పాడు తిరపతి చిన్న కొడుకు.

''... అవును మరి యిక్కడయితే అన్నీ సాగుతాయి. కొడుకింట్ల ఏలుంటాడు? పూర్వ జల్మల అచ్చున్నాను. ఇప్పుడు పెట్టనా?...'' అమ్మాయమ్మ ఇంట్లోకి నడిచింది. కాదు, నడవబోయింది. వీల్లేకపోయింది. ఉన్న ఒక్క గది తలుపులూ మూసుకుపోయాయి. లోపల అల్లుడూ కూతురున్నారు. అరుగు మీద నిలబడలేక... నీరసానికి తూలబోయి తప్పదన్నట్లు వీధి గుమ్మంలోని బడ్డీ ఎక్కి కూర్చుంది.

తవిటయ్య్ వాతావరణం గ్రహించి మనవడ్ని తిరిగి బస్సుకు పంపించి, తను మాత్రం వెళ్ళి బడ్డీ వార కూర్చున్నాడు.

పొద్దుగూకుతున్నవేళ, ఇంటి గది తలుపులు తెరవడం కోసమే ఎదురుచూస్తున్న అమ్మాయమ్మ మాటిమాటికి బడ్డీ దిగి ఇంట్లోకి చూస్తోంది. అలా చాలాసార్లు చూసి అలసిపోయాక, అంతకన్నా అలసిపోతూ ఆవలింతలు తీస్తూ అల్లుడుక్రిష్ణ గదిలోంచి గుమ్మం దిగి వచ్చాడు. బడ్డీలోని గోల్డుఫ్లాక్ పాకెట్లు రెండు పట్టుకొని వెనుదిరిగబోతే అమ్మాయమ్మ 'బాబూ' అంది. అతగాడు ఆగాడు.

నడుం సలుపూ, వంటా వుండడంవల్ల అల్లుడ్ని బడ్డీలో వుండమని అమ్మాయమ్మ అడగబోతే 'తలనొప్పి'గా వుందని వెళ్ళి తలుపేసుకున్నాడు.

అమ్మాయమ్మ- కూతురు కాపురాన్ని తలచుకొని ముచ్చట పడలేదు. ఆరు మాసాలయినా అలాగే వున్న వాళ్ళని చూస్తే- బతుకు తాలుకా బాదర బందీ లేకపోవడం ఆమెను మరీ బాధపెట్టింది. ఆ బాధ ఓపికనివ్వని వంటి బాధతో కలిసి కోపంగా మారింది. పక్కనే వున్న తండ్రిని తనని కన్నందుకు తిట్టిపోసింది.

ఆ తర్వాత వేళ వున్నా - బేరం వున్నా- ఆ రాత్రి బడ్డీని మూసేసివచ్చి వంటచేసి నిండు కంచాల్ని 'గదిలోకి' పంపి ఎంగిలి కంచాల్ని అందుకుంది. మిగిలింది తండ్రికి కొంత పెట్టి, ఆకలికి తిను కొంత తిని గుమ్మం మీదే చేరగిలబడింది. ముసలోడు బడ్డీ బల్ల మీదెళ్ళి పడుకున్నాడు.

అమ్మాయమ్మకు తెలివొచ్చేసరికి బారెడు పొద్దెక్కింది.

అదికాదు ఆమెను ఆశ్చర్యపరిచింది. అల్లుడూ కూతురూ ఎక్కడికో పయనమవుతున్నారని బోధపడింది. ఆపలేకపోయింది. వాళ్ళు వెళ్లాక చూస్తే బడ్డీలోని డబ్బులు చిల్లరతో కలిపి చెక్కేసాయి. నిట్టూర్చింది. రెండ్రోజుల్లో తిరిగొచ్చిన అల్లుడ్నీ కూతుర్నీ గట్టిగానే హెచ్చరించింది.

అల్లుడు క్రిష్ణ బడ్డీ ఎక్కాడు. బాధ్యత పంచుకున్నాడు. అమ్మాయమ్మ మనసు కుదిటపడింది.

ముసలి తవిటయ్య నెత్తి మీద మూటయ్యాడు. ఆ భారం రోజు రోజుకీ పెరిగేది తప్ప తరిగేదిలా అగుపించలేదు అమ్మాయమ్మకి. అలా అనిపించడానికి అగుపించడానికి అల్లుడూ అదే మాటన్నాడు. ఇరుగూ పొరుగూ అదే అన్నారు.

అల్లుడ్ని తనింటికి తెచ్చుకుంటే ఆరు మాసాలు తిరక్కుండానే - అంతా అన్నారు గదా 'నువ్వే అల్లుడి దగ్గరుంటన్నావు, చాలదు నీ పీకకి ఒక ముసిలోడు లంకి?'' అమ్మాయమ్మకి 'యిది నిజమే'ననీ అనుకుంది. అలాటిది ఆ కొడుకు రెండ్రోజుల్లో తిప్పి పంపీసినాడని, ముసిలోడు తానే వచ్చీసినట్టు కప్పిపుచ్చుతున్నాడని వూహించి, అదే విషయం ముసిలోణ్ని అడిగింది.

లేదన్నట్టు అడ్డంగా తలూపాడు తవిటయ్య. ఎన్ని దఫాలడిగినా ఒకే మాట. మరో మాటలేదు. దాంతో తిట్లూ పడేవాడు.

''కుంబానికి రా...'' అమ్మాయమ్మదే కాదు దాని కడుపున పుట్టిన కూతురిదీ భోజనానికి పిల్చినప్పుడు అదే సంబోధన. 'ఈ కళ్ళుకొచ్చిన చత్వారం చెవులకొస్తే బాగుణ్ను' అనుకున్నాడు. అదే మాట పైకన్నాడు.

''ఇప్పుడికే చస్తన్నాము, మమ్మల్నిలగయినా బతకనివ్వవా?'' అని అమ్మాయమ్మ తిట్టిపోసింది. కొడుకు దగ్గరకే పొమ్మంది.

తవిటయ్య తలయినా ఆడించలేదు.

వానకాడ వరదలాగ పండగొచ్చింది. అల్లుడూ కూతురూ వూరెళ్ళాక, యింట్లో అమ్మాయమ్మ తండ్రితో మిగిలింది. పండగన్నెప్పి, అలాపింటి రోజు వొట్టిరోజుల్లాగ ఎలాగ ముసిలోడ్ని వుంచడమని వేటమాంసం ఒక వోటా తెచ్చి వండింది. గారెలు చేసిపెట్టింది. 'అన్నా ఆడినా ఆడికెవులు? నీనున్నంత వరకే గదా... ఇదమ్మా పలానమ్మ కన్నతండ్రి నిలగచూసింది.' అని ఈజనమే అనేస్తా' రనీసి- తిన్నంత వడ్డించింది.

తవిటయ్య నోరు కట్టుకోలేక గారెలూ మంసమూ తిన్నాడు.

పొద్దుబోయిసరికి ముసిలోడు కడుపు గుప్ మంది. విరోచనాలు మొదలయ్యాయి. కళ్ళువుపడవనీసి ఆడదాయి అయినా అమ్మాయమ్మ గోర్జికి తీసికెళ్ళింది. తిప్పలేక పెరట్లో కూర్చోపెట్టింది. ఆ మర్నాటికి లేవ లేక మంచం మీదే విరోచనాలయిపోనాయి. అలాటోడుపు ఏల తినాలని తండ్రిని తిట్టిపోస్తూనే, ముందుగా కానుకోలేకపోయి తన చేతుల్తో పెట్టినందుకు తనని తనే తిట్టుకుంది.

ఆ సాయంత్రానికి అమ్మాయమ్మ అల్లుడూ కూతురూ వచ్చారు. ఇంట్లోని పరిస్థితి చూసి ''ఏటి తినేనావు? ఏదికది తినేస్తే నీకిందెవుడు చెయ్యలేడు. ఇలాగ చస్తే పలానోలు సరీగ చూడలేదని మాకెంత అప్రతిష్ట? ఎంత నింద? చింతసచ్చినా పుల్ల సావలేదు. ఇంత వయసొచ్చినా నాలుక రుచి చూసుకుంటే ఏటవుతాదని ఇద్దరూ ముసలోణ్ని తిట్టారు. అమ్మాయమ్మని క్రిష్ట పదల్లేదు.

''అదికి బుద్ది లేదు... నీకుండొద్దా? ఇంట్లో వంట చేయ్యడానికి అన్ని నొప్పులూ వచ్చేస్తాయి, ఇప్పుడే నొప్పులూ లేవు... అయినా ఇలాగ ముసిల్లోడ్ని చంపిద్దుమనే?!..''

అమ్మాయమ్మ కఱ్ఱ గట్టేసింది అల్లుడు మాటకి. కూతురు కూడా వంతపాడి ఒకటయ్యాసరికి ఆమె నోరూ పడిపోయినట్టు మూగదయిపోయింది.

''నీకేవున్నాది పేమ.. కారిపోతంది. అయ్యనీసి ఆ ముసలోడికి మాంసమెట్టేస్తే అరాయించుకోవద్దా? పండో పలమో ఇస్తావుగాని... అయినా ఏటీవ్వడానికి నీకు బూమి బుడ్డిగుల్లయిపోయిందే?!...'' అన్చెప్పి ఇరుగూ పొరుగూ అమ్మాయమ్మనే దుమ్మెత్తిపోసారు.

తవిటయ్య తనదే తప్పని చెప్పాలనుకున్నాడు. తాగినవి దమ్మిడీ కల్లు యిల్లళ్లా వూతులే అయిపోయిందని విడమర్చాలనుకున్నాడు. వంటి నీరసం నోరు నొక్కేసింది. మాటరాలేదు, గాలిపోయింది. మొత్తానికి మూడో రోజుకి లేచి కూర్చున్నాడు. నాటు వైద్యంతోనే తెరుకున్నాడు.

అమ్మాయమ్మ తేరుకోలేకపోవడాన్ని తవిటయ్య గ్రహించాడు. బతుకు ముళ్ళుదారయి పోయిందని కూతురింటికి... కూతురు కాలికి సీలయి వుందామని వచ్చాడు. ఆ సీలలకి కూతురు కాళ్ళు పుళ్ళయిపోయి నడవలేని పశువులా మిగిలిపోయిందనీ అనుకున్నాడు. అనుకున్నాక యింక అక్కడ ఆయింట వుండకూడదని తేల్చుకున్నాడు.

వారం తిరిగి, వంటికి ఊతమొచ్చాక మిత్తనోరి వూరెల్తున్నానని తవిటయ్య ఇల్లు బయలెళ్ళాడు. ఎవరూ అడ్డు చెప్పలేదు.

నిజంగానే మిత్తనోరి వూరెల్లడం, ఆపక్కూరిలోనే వుచిత నేత్రశిబిరం పెడితే వెళ్ళి కళ్ళు చూపించుకున్నాడు. అక్కడి డాక్టర్లు కళ్ళాపరేషను అవసరమని చెప్పి వుచితంగానే చేసారు. పైసో పరకోపడినా, పని సాయానికైనా మిత్తనోరి పిల్లలు నిలబడ్డారు. మొత్తానికి రెండు వారాలకి చూపొచ్చింది. మరో రెండు వారాలకి తిరిగి కూతురింట చేరాడు.

అమ్మాయమ్మ తండ్రిని చూసి ఉబ్బితబ్బిబ్బైపోయింది. భగవంతుడు ప్రత్యక్షమై గుడ్డి తండ్రికి కళ్లిచ్చినట్టు గొప్ప సందడిపడిపోయింది. ఆమె అల్లుడూ కూతురూ కూడా చాలా సంతోషించారు. ఇరుగూ పొరుగూ ఆనందించారు.

మనమరాలి కడుపు పండిందని, మునిమనవడు కడుపులోపడ్డ వేళావిశేషమని చాలా మంది క్రిష్ణనీ అతని పెళ్లాన్నీ మెచ్చుకున్నారు. పుట్టే బిడ్డ కోసం కలలుగన్నారు. అవి తీర్చుకోవడం కోసం క్రిష్ణ ఏరియా మీటికి పోయి సరుకులు కొనడం తెచ్చి అమ్మడం చేపట్టాడు. మళ్ళీ ముసిలోణ్ని బడ్డీ ఎక్కించారు.

తవిటయ్య బడ్డీ మీదుండగా మిట్టమధ్యాహ్నం వేళ అతగాని కొడుకు తిరపతి పరుగులాంటి సడకతో వచ్చాడు. అతని వేగానికి కంగారుపడ్డ తవిటయ్య 'ఏమిరయ్యా ఏటయ్యిందిరా, అంతా బాగేనేటి?' బడ్డీ దిగి కొడుక్కెదురుగా వెళ్ళి నిల్చున్నాడు. తిరపతి ఎప్పుడూ పుట్టి బుద్దెరిగింది మొదలు ఇంతదాక చూడని వింతలాగ తండ్రి కళ్ళలోకి చూసాడు.

'ఏట్రా...?' రెట్టించాడు కొడుకు అయోమయానికి, ఆశ్చర్యానికి విస్తుపోతూ తవిటయ్య.

'నాయినా... అయ్యా...' అని మాత్రమే అన్నాడు, అనగలిగాడు తిరపతి. తండ్రి కళ్ళగోళాల్ని తీసి ముద్దెట్టుకుందామనిపించింది.

తమ్ముడు తిరపతి ఆతృత చూసిన అమ్మాయమ్మ గ్రహించాల్సిందేదో గ్రహించినట్టు వుంది ఇంకా అబ్బురం చాలించని తమ్ముణ్ని రెక్క పట్టుకులాగి- "ఇన్నాళ్ళికి... అబ్బో... చేన్నాళ్ళకి నీకు అయ్య గుర్తొచ్చీసినాడురా?" అంది వెక్కిరింత పట్టలేని కోపంతో.

"బాగులేదన్నారు ఎలాగున్నావురాయ్యా..." తిరపతి తన అప్ప అమ్మాయమ్మని పట్టించుకోకుండా అయ్యనే అడిగాడు.

'ఏటి బాగులేదు? కళ్ళా...? కడుపా?...?" అమ్మాయమ్మే ఆగలేకపోయి అన్నమాటనే మళ్ళీ అంది.

"కళ్ళు బాగయితే నీకుసేన..." మళ్ళీ అమ్మాయమ్మే పొడిచింది.

"గుడ్డోడుకి ఏటికావాల? కళ్ళే!" శాంతంగానే అన్నాడు తిరపతి.

"ఆడు కాదు నువ్వు గుడ్డోడివి. అందుకే యిన్నాళ్లు నీకు తండ్రి అగుపించలేదా? మరేటి? ఆడికి కళ్ళు రాకపోతే నువ్వు తలకొరివి పెట్టడానికయినా వచ్చుందువా?" రాకపోదువనే- తగువుకి దిగుతున్నట్టే ఎత్తుకుంది అమ్మాయమ్మ.

"అవునే... నేనూ మీ వదినీ అందరం గుడ్డోలిమయిపోయామే అప్పా, నిజం చెప్పినావు, గుడ్డోడినయే ఆణ్ని నీకొదిలినాను. నువ్వు పసుపు కుంకాలు పోయి మూల చేరిపోతే- నా యింటి నుండి తండ్రిని పంపి పాతికేళ్ళయి వదులుకున్నాను. ఇకన వదులుకోను. నువ్వన్ని తరువాతయినా నా కళ్ళు తెరాలిగదా? పారలు ఈడాలి గదా?" అని అప్పతో ముడి ముక్క మాట్లాడి 'అయ్యా నువ్వు బయల్దేర్రా' తండ్రి చేతిని పట్టుకున్నాడు తిరుపతి.

అప్పుడే క్రిష్ణ ఏరియా మీద నుండి వచ్చాడు. 'అత్తా నువ్వాగు' అని అమ్మాయమ్మని వెనక్కితోసాడు. అతగాని భార్య మేనమామ బుర్ర సెక్కలు చేసి తిడుతుంటే కేకేసి ఆగమన్నాడు.

"...అలికి ముగ్గేస్తే కోడి గొద్దేసిందని... ఇదేటండిది? అతగాడు మీకు తండ్రే కావచ్చు. ఆవిడకి తండ్రిగాడా? ఎక్కడుంటేటయింది?... అయినా అతగాడి కింద పర్రాకులన్నీ పడింది మేము. మీరొచ్చిప్పుడు కోడిపిల్లని గెద్ద తన్నుకు పోయినట్టు పోతామంటే ఎలాగండీ..." క్రిష్ణ గౌరవంగా శాంతంగా కప్పిపుచ్చే ధోరణిలో మాట్లాడుతున్నానని అనుకున్నా- అందుకు విరుద్ధంగా మనసులోని మాటని గొంతు దాచిపెట్టలేదు.

అందుకే తిరపతికి ఎక్కడో కాలింది. కాలిన మనిషి ఓర్చుకోలేనట్టు ఓర్చుకో లేకపోయాడు.

"కుప్ప కాలిపోతుందే నెయ్యిలేరుకున్న సజ్జుగ తయారయినావురా నాయప్ప గారల్లుడా... శ్రీక్రిష్ట భగవానుడా? మాయొద్దు. మావి అంతంత బతుకులు. మా బతుకు బాదకీ బాగుకీ సాయంగున్న మనిషికోసం మేము కొట్టుకుచస్తన్నాం. మద్దిన నవ్వొచ్చి నెయ్యిలేరుకోడం ఏమీ బాగోలేదు......."

తిరపతిని పూర్తిగా మాట్లాడనివ్వకుండా అతని మేనగోడలు 'నా మొగుడ్ని అండానికి నువ్వెవుడివి. అలాటి మాటలాడితే నాలక' సీలికలయిపోదా' ఇంకా ఎత్తుకొనేది, కాని ఆమె పెనిమిటి వెనక్కిలాగి ఒక్క కసురుకసిరాడు.

"ఎవులెన్ని రయి పాయాలూ పఁరాకులూ పడ్డారో నీనెరుగుదును. మీరెట్టిందీ లేదు... ఇందల నేనెట్టిందీ లేదు. పిల్లి కళ్ళు మూసుకొని పాలు తాగితే లోకానికి చీకటే?!.... అసిద్ధంలోకి రాయిసరొద్దు... అందరి మీదకీ తుళ్ళుతాది..." అన్నాడు తిరపతి. కాని మిత్తనోరి ఇంటి దగ్గర నుండి తనకి తండ్రి రాయించిన ఉత్తరం గురించి చెప్పలేదు.

తవిటయ్య తలవంచేసిన మేకలాగున్నాడు. ఎవరెటు బలంగా లాగితే అటు వచ్చి పడినట్టున్నాడే గాని మరొకలాగలేడు.

అప్పటికే బడ్డీ చుట్టూ జనం చేరిపోయారు.

క్రిష్ణ ఏదో అనబోతే... 'నీకిందల సంబందం లేదు, కలిగించుకో వద్దు. మర్యాద నిలుపుకోండి... ఇది మా అప్పాతమ్ముళ్ళ గొడవ. మాయయ్యని గురించిన పేచీ. మీకిందలేల్లేదు.." తెంపేసినాడు తిరపతి, నరసమ్మె ఆమాట వూరు బయేల్దేరేముందు చెప్పింది. ముడిముక్క కాడికి వచ్చేసరికి మొగబిడితనమొద్దని మరి మరి చెప్పి పంపింది. అది కొంతవరకూ తిరపతి మీద పనిచేసినట్టుగుంది.

తనకు గౌరవం దక్కదనో.... నలుగుర్లో హుందాగుందామనో క్రిష్ణ మంత్రం పడినట్టు టక్కున నోరు ముస్నాడు.

"ముసిలోడా నీకెక్కడ నచ్చితె అక్కడుండు..." అన్నారెవరో పెద్దాయన.

"అలిద్దరూ రొండుకళ్ళునాకు..... ఏదో ఒక్కన్ను పొడునుకోమంతే ఏకన్నని పొడుసుకుందీది.....?" అని ఆగి దీర్ఘంగా శ్వాసవిడిచి... 'నాకు కళ్ళురాడం కాదుగాని కలియుగం అంతమయిపోయినట్టుంది. .." అని మట్టి మీద కూర్చుండిపోయాడు తవిటయ్య.

అందరూ ఒకరికొకరూ గుడగుడలాడి గొలుక్కుంటున్నారు.

"బాబూ అదా నీ యింటి ఆడపిల్ల. పైదాయి కాదు. అడా నీకు తండ్రి... లోకరివాజు ప్రకారం కొడుకు దగ్గరే వుండాలి ఏ తండ్రయినా.... మరి ముండమోసిన ఆడకూతురు దగ్గర తండ్రినొగ్గిడమే సబబు కాకపోయినా నీపేరుకి నీకూ గవురవం..." ఇందాకటి పెద్దాయిన తీర్పివ్వబోతే మరో పెద్దాయన కలుగజేసుకొన్నాడు.

"నిజమేనండి, కాని ఆయమ్మకి ఒక్కగానొక్క కూతురు, దానిపెళ్ళీ అయిపోయింది. మంచోడు అల్లుడున్నాడు. పాతికేలయిన ముసిలోడున్నాడు గదా... ఇకన ఆడి కొడుకుతో ఆణ్ణీ పోనిస్తే అదే న్యాయం... ధర్మం.... ఏమమ్మా అమ్మాయమ్మా మామందరం కాదు. నువ్వే చెప్పు. అదే తీర్పు. లోకం మెచ్చాల. మయిమీద మాటే మిగిలిపోతాది"

ఆ మాటలు విన్నాక అమ్మాయమ్మ ఔననిగాని కాదనిగాని అనలేకపోయింది. తండ్రిని చూసింది. అతగాడు బుర్రదించీసున్నాడు. చెప్పినతని ఆఖరి మాటలు చెవిలో గింగురుమంటున్నాయి. ఆమె కళ్ళని అలానే తిప్పి అల్లుడ్ని చూసింది. అల్లుడు ఏం చెప్పే- సైగ చేసే వీలులేకపోయినట్టే వుంది, తెరచాపలా రెప్పలు ఎత్తీ దించుతున్నాడు.

"అయ్యా..." అని అమ్మాయమ్మ పిలిచేసరికి తవిటయ్య లేచి నిలుచున్నాడు. అందరూ ఆసక్తిగా చూస్తున్నారు.

"తమ్ముడితోటి ఎళ్ళు... అయ్యా ఎల్లరా, ఆడికింకా నలుగురు పిల్లలున్నారు. అల్లా బాబు చెప్పినట్టు నాకూతురు పెళ్ళి అయిపోయింది. పురుడూ పున్నెము నీను చూస్తాను గానా?!... నాకింకేటి కావాల? ఏటి కూడెట్టుకోవాల?..." అని తండ్రి చేతిని తమ్ముడి చేతిలో వుంచింది.

ఎవ్వరూ ఏమి మాట్లాడలేదు, అల్లుడు క్రిష్ణకు ఆ చప్పుడులేనితనం మాట్లాడడానికి సందివ్వకుండా చేసింది.

తిరపతికి ఏమూలో తండ్రిని అప్ప దగ్గరే వదిలేసి పోదామనిపించింది. పెళ్ళాం మాటలు గుర్తుకొచ్చి, దానికేదో ఒకలాగ సర్ది చెప్పొచ్చులే అనీ అనుకున్నాడు. అంతలో అంతా చప్పట్లు చరిచినట్లు 'సెబాస్... అదీ మాట' అన్నారు. అనుకున్నారు. ఆమాటలే ఆడుకున్నారు. ఆ మాటలన్నీ ముసిలోడ్ని తిరపతి వెంట సన్నర్ధం చేసి నడిపించాయి.

ఇంటికొచ్చిన మొగుడ్నీ మామనీ చూసి నరసమ్మ ఆనందానికి అంతేలేకుండా పోయింది. పరమాన్నం వండి దేవుడి ముందు పెట్టింది. ముందుగా మామకి పెట్టింది. ఆ తర్వాతే మగనికి పెట్టింది. పిల్లలకున్నూ.

ఆరాత్రి-నిద్రకు పక్కలేస్తూ వదినమ్మ బాగోగులడిగింది నరసమ్మ. 'అల్లుడు క్రిష్ణనీ ఆడిపెళ్ళాన్ని పిలుపు చెయ్యవలసింద'నీ అంది. 'పిల్లని బాగా చూసుకుంటాడా?' అనీ అడిగింది. సమాధానం రాకుండా 'చక్కగ చూసుకుంటే అదేసేననీ' అంది. 'మీయప్పని రొన్నాలు రమ్మనలేకపోనావా?' అనీ అంది. 'మర్యాద తెలీని మగమనిషితో ఏటి బతికీద'ని తిరపతిని రొండు తిట్లు తిట్టింది.

ఆఖర్న నరసమ్మ ఆగి ఆలోచనగా ఒకమాట అంది.

"మనిసి బతుకు మర్రి సెట్టులాగయిపోయింది. ఏలెంత నేలకి తన్నినా బరువు కాయడానికి బతుకు మెయ్యడానికి ఊడలు దించుతాది. ఊతమవుతాది. ఒక్కడి కష్టంతోటి కుటమాము గడిసీ కాలం సరి... మొల్తాడు కట్టినోలు దగ్గర్నుంచి మూలనకూకున్న ముసిలోలి దాక- మొయ్యక తప్పదు. రొట్టి ముక్కేసి కాట్లాడించినట్టు ఆ బగవంతుడు మనల్ని కాట్లాడిస్తన్నాడు. యిదంతా లేక దరిద్రమే. వుంటే ముసిలోడు ఎక్కడుంటేటి?..."

ఆ మాట తవిటయ్య గుండె బరువును తేలిక చేసింది. అలసిన కళ్ళు మూతలు పడ్డాయి. రెప్పలిప్పేసరికి చీకటి పోయి వెలుగొచ్చింది. ఆ వెలుగు వీధి వాకిట ఎండవల్లొచ్చింది. ఆ ఎండతో పాటు పాతబడ్డీకొట్టొచ్చింది. మామిడి తోరణాలొచ్చాయి. పసుపు కుంకాల బొట్లు వొచ్చాయి. యింకా బడ్డీలోకి వెలితి వెలితిగానైనా సామాన్లొచ్చాయి. అన్నీ వచ్చినాక నరసమ్మ మెడలో బంగారం తాడుస్థానంలో పసుపు గొమ్ముతో కట్టిపేమిన దారం వచ్చింది. అంతకుమించిన వెలుతురొచ్చింది ఆమె ముఖంలో... కదలికలో...

ఎక్కడో కన్న కల. ఎప్పటికీ మిగిలిపోయిన కల. ఎప్పటికప్పుడు చేజారిపోయిన కల. నరసమ్మ కన్న కల. తిరపతయ్యకూ అంటిన కల. ఇంటిల్లిపాదికీ వచ్చిన కల.

ఇప్పుడు కల కాదు, తవిటయ్య బడ్డీలో... తమ యింటిముందు బడ్డీలో... తమదైన బడ్డీలో కూర్చున్నాడు.

అందుకే తొలి మొక్కుబడిగా ఆ రాత్రికే త్రినాధస్వామి మేళా, ప్రసాదం యింటింటికీ పంచింది నరసమ్మ. బడ్డీ కొట్టు గురించి చెప్పింది. ముందలీదే కాదు పెరడీదీ వదలకుండా చెప్పింది.

ఆ రాత్రి నరసమ్మకు నిద్ర రానట్టుగానే వుంది. బడ్డీలోకి ఏయే సామాన్లు కావాలో, అవి ఎక్కడ చవగ్గా దొరుకుతాయో మామతో మాటలాడింది. మగనితో అవి ఎలా తీసుకురావాలో చెప్పింది. పెద్ద పిల్లలిద్దరూ పనిచేసే చోట చేసుకు రావాల్సిన పనులు పురమాయించింది.

ఆ తర్వాత అందరూ నిద్రపోయినా నరసమ్మ మాత్రం ఏ అప్పు ఎప్పుడు తీరుతుందో లెక్కలు వేసింది. అసలెంతో వడ్డీ ఎంతో అన్నీ తల్చుకొని భయపడింది. బడ్డీని అభయహస్తంగా భావించింది. కొద్దీగా పూటిక్కితే చిన్న వాళ్ళద్దరినీ కాలేజీచదువులూ చదివించాలనుకుంది. చిన్న చిన్న చదువులు ఈ కాలం పనికి రావంది. అదే విషయం భర్త నడిగింది. తిరపతి వింటున్నట్టు వూకొడుతున్నాడేగాని నిద్రలోకి జారుకున్నాడు. అందుకే నరసమ్మ అన్నా అనకపోయినా ఊ కొడుతున్నాడు. అది గ్రహించిన నరసమ్మ నెమ్మదిగానైనా తిట్టింది.ఆలోచనలో పడింది. 'కోడిగుడ్డు వారిస్తే సట్టిడు' అనుకుంది. రేపటి మీద ఆశలతో రోజుల్ని కొలిచింది.

జీతాల్లేవని జూటు మిల్లుకు వెళ్ళడం మానుకొవద్దని చెప్పింది నరసమ్మ. ఇంతకాలం చేసి ఇప్పుడు వదిలీడం మంచిది కాదంది. 'నలుగురితోటి నారాయణ... కులం తోటి గోవింద' అంది. ఆమె చెప్పిన చాలాసేపటికి నిద్రలో వూఁ కొట్టాడు తిరపతి.

అక్కడికి నాల్రోజులు తిరిగాయి.

మేనకోడలికి నెలలుకదా పిండివంటలు పట్టుకు వెళ్దామనునకుంది నరసమ్మ. అలాగ అమ్మాయమ్మోదిననీ చూసి రావచ్చుననుకుంది. ముసిలోడు వచ్చేసిన తరువాత ఎలగుందో ఏటో'- అనీ అనుకుంది. బడ్డీ కొట్టు జెంజాటంలో పడి రేపుమాపు అవుతోంది. 'ఇంక రేపు మనవడో మనపరాలో పుడితే తొలిసూరు కాబట్టి తాతగోరు వంక ఆంజినేయుడి బిల్ల బంగారప్పిసరది చేయించలేకపోయినా, వెండి మొలతాడయినా వెయ్యాలనుకుంది.

పొద్దోగట్ల నరసమ్మ పెనమేసి అరిసిలూ పొంగడాలు చేసింది. బియ్యం దంచి బెల్లంతోటి సలిబిండీ చేసింది. మర్నాటి పొద్దున్నే అన్నీ సర్దికట్టుకొని గుమ్మందిగుతూ మొగునికీ మామకీ యింటి జాగ్రత్తలు చెప్పింది.

అడుగలగ వీధి లెట్టబోయేసరికి సన్నాసమ్మ 'నరసమ్మోదినా' అంటూ వచ్చింది. 'రేతిరి బాగా పొద్దుబోయిందని రాలేదు, అందుకే పెందిల లేస్తోటికి వచ్చినాను, నువ్వేటు పారిపోతన్నావు?...'' అంది జుట్టు సిగపెట్టుకుంటూ.

"ఏమే?..." అని, "మాయమ్మోయమ్మ కూతురు కడుపుతోటున్నాది గదా..." చేతిలోని సంచుల వంక చూసింది. ఆ చూపు సన్నాసమ్మకు అర్థమయింది.

"... బాగున్నాది సోబత్తు, అవన్నీ నిలుపుకున్నోలుకి. ఆ పిల్ల తల్లినే కాతరుసెయ్యి లేదు. అయినా నిన్న పెళ్ళయినా ఇవేళ్టికి మొగుడి మాటే గీత. ఎవులయినా అంతే... ఆ పిల్ల మటుకు ఏటి సెయ్యగలదు? ఎటోచ్చి అమ్మోయమ్మోదినికి దినం తీరింది కాదు..." అని నిట్టూర్చింది సన్నాసమ్మ.

"ఏటయిందే..." ఉలిక్కిపడింది నరసమ్మ.

గుమ్మంలో నిలబడి పళ్ళోముపుల్ల చేస్తున్న తిరపతి గబగబా దగ్గర కొచ్చి నిలబడ్డాడు. తవిటయ్య బడ్డీ తాళం తియ్యబోతూ మాట విని 'ఏటయిందే ఏటయిందే...' పరుగున వచ్చాడు.

'నాల్రోజులయిన నీట్లో అగ్గిపుట్టిపోయిందంటూ మొదలుపెట్టి' ఆగి-

"మా బావగోరాలు ఆ వూర్లోటే వున్నారు గదా... అల పెద్ద పిల్ల సవర్తాడితే నిన్నెళ్ళి సూసొచ్చినాను. అలాగ అమ్మోయమ్మని సూద్దుమని ఎళ్లినాను..." సన్నాసమ్మ మాట పూర్తి కాకుండానే 'ఏటయిందేటయింద'ని అడిగారు తవిటయ్య, నరసమ్మున్నూ.

"... ఆకుల్లేని సెట్టు గాలికి మొగుడు. నిరు సంపతి దారి ఊరికి మొగుడని వట్టినే అన్నారా?... ఏమీ లేనోడని ఇల్లరికమని తెచ్చి యింట్లెట్టుకుంటే కంట్లకర్రెట్టి నాడువా మీ వదినమ్మకి దొరికిన అల్లుడు. కొడుకయినా అల్లుడయినా ఆడేననీసి నెత్తెక్కించుకుంటే తాడవ మీదసేసి తన్నీసి నాడు. కొడుక్కన్న అతి మిక్కిలిగ సూసింది అమ్మోయమ్మ. అయినా కుక్కకి నెయ్యేసి ఇములు తాది, దాని బుద్ధది సూపించుకుంతాది, ఈడి బుద్ధీడు సూపించుకున్నాడు..."

సన్నాసమ్మ చెప్పిన విషయం అర్థమవుతున్నా అందరికీ అసలు విషయం అంతుపట్టులేదు- అదే అడిగారు.

"... తిరపతన్నా.. అయాళ నువ్వు అయ్యని తీసుకోని వచ్చేసిన దగ్గిర్నుండేనట అగ్గిరాజుకుందట. అదేటమ్మా..... ఏమ్మోటది?... కరునుడుసెల్లిల్లాగ దానమిచ్చేసిందట ముసిలోడ్ని నీకు. సేతిలో సెయ్యేసి మరీ పట్టుకుపొమ్మని పంపిందట. అదే మీయప్ప సేసిన తప్పు. అది మొదలు పొద్దుటాపొద్దోయని లేదు. ఎప్పుడూ జట్టీలేనట. తగువులేనట.. బాడిసకి పదివొస్తే బాగా పట్టుర సొన్నాయని... వూ అంటే తప్పట. ఆ అంటే తప్పట. అసలాయింట్ల వుంటే తప్పట..."

సన్నాసమ్మ జారిన సిగని సర్ది మళ్ళీ రెండు చేతిల్తో అవనీలగా మెట్టముడి పెట్టుకుంది. నరసమ్మ తిరపతీ జరిగింది కొద్ది కొద్దిగా బోదపడుతూ వుండడంతో కనుగుడ్లు బిగించారు. తవిటయ్య నెత్తిన పిడుగుపడినట్టు మోయలేనట్టు నేలమీద కూర్చుండిపోయాడు.

"... మీ అమ్మాయప్ప ముసిలోడ్ని వుంచమంటే నువ్వుంచుదువట. బడ్డీ మీద ముసలోడ్ని వుంచి బాగుపడుదురట.మన అమ్మాయప్పకి బాగుపడే యోగమే కాదు, బాగుపెట్టే యోగమూ లేదట. ఎవులు బతుకులు ఆలకి బరువైపోనాయట. అప్పప్పిడు ఆలకి బరువట. బారమట. అల్లుడు అమ్మాయప్పని యింట్లోంచి తొలీమంటాడట. సెప్పేవోడుకి సెడుగాలమయితే ఇన్నిదానికీ ఇవేకముండొద్దా? అల్లుడు మరేటి ఆశలు సూపించినాడో మరేటని తాటించినాడో కడుపున పుట్టిన కూతురూ అలాగే తయారయింది. ఆపిల్లా తగ్గలేదుట. తల్లిని ఎన్నేసి మాటలన్నాదటమ్మా. రేపు పిల్లా బెల్లా పుడతారట. ఎలా బతకడమో ఏటోననీసి బేగిబేగి కూడెట్టుకందామనేసి ఆ కూతురికీ ఆశ పుట్టిపోయుంది..."

'రేపు దీని పిల్లకీ పిచ్చుక్కీ యిదిబారమయిపోదా?.." ఎదురింటి ముసలమ్మ ఎప్పుడు చేరిందోగాని వెంటనే అంది.

ఒకరూ ఒకరూ చేరి ఆ యింటి మందు గుంపవుతున్నారు.

'రేపటి మాట రేపు చూడొచ్చును, ఇవాల్టికే టంతారయితే? నాకు కబురయినా పెట్టలేదేమి?' 'ఏదో తేల్చేద్దుననే అడిగాడు తిరపతి. పళ్ళు పటపట కొరికాడు. పళ్ళోము పుళ్ళ పడేసి తుపుక్కున కసిగా వుమ్మాడు.

తవిటయ్య నేలమీద నుండి లేవకుండానే 'అయితేటయిందయితే' అడిగాడు.

"వార్సిన బక్క తేటనీరు తాగిందని అప్ప వల్లకుందట. వల్లకుండదా? యిన్నాళ్ళూ గుట్టు గుమ్మంకి రాకుండ బతికింది. అల్లుడొచ్చినాడు గుటుక్కుమనిపించీసి నాడు. అప్పనోరుమూసుకోడం తప్పుకింద జమకట్టీసినారు. అలాటవుడు అక్కడితోటి ఆగుతారా? వున్న యిల్లు ఆలపేరున రాయాలట. యింక కతెక్కడ? కార్యమెక్కడ? నా రోజులు గడొద్దా? అంటాదప్ప. నాకయినా ఎవులున్నారు? ఎప్పుడు కయినా ఆలదేనా?! అంటే- అందుకనే యిల్లు ఆలపేరున నోటు రాసీమని గొడవ, లేదంతే యిల్లొదిలి పొమ్మని పేచి... ముసిలోడ్ని యిచ్చేసినట్టే అందిచ్చేసినట్టే రేపు యిల్లయినా ఎవులికయినా రాసిచ్చేస్తాదట.. అందుకని కాయితాల్తోటి ఎవుడ్నో పట్టుకొచ్చినాడట..... అల్లుడు"..

సన్నాసమ్మ చెప్పడం పూర్తి కాకుండానే "సంతకం యెట్టీసిందే?" నరసమ్మ ఆగలేక అడిగింది. 'లేదులేద'ని- అడ్డంగ తలూపింది సన్నాసమ్మ.

"మంచిపనిసేసింది, సంతకంతోటి సరా? ఆ ఒక్కరవ్వ మనపేర్నలేపోతే ఆలు లచ్చిపెడతారేటి? అలక్కాకే ఇలాక్కొచ్చినా మరేటి? తనువున్నంతవరకు పిల్లని తల్లీ నమ్మకూడదు గాక, నమ్మకూడదు..." అనుభవం వెళ్ళబోసుకుంది ఇందాకటి ముసల్ది.

"సంతకమెట్టలేదనీసి తన్ననానికి వచ్చినాడటమ్మా..." చెప్పబోయింది సన్నాసమ్మ.

"అడికేటి పెలిమా, పోత్రమా? అంత వుత్తిపాతమా? ఆడి బుఱ్ఱ పడిపోతే, ఆడిపేరు దాగిపోతే? ఆడి బుఱ్ఱ సిక్కియ్యి... సుబ్బరంగ బతుకుంతుంటే ఈడు సెనిసుక్కలాగ దాపురించినాడు. వూర్లోటోళ్ళు ఏటన్లదా...?" తిట్టుకుంటూ అడిగింది నరసమ్మ.

"పయోలా పరకోలా... సొంత మడిసి, యింటళ్ళుడు..." ముసల్దాయి అంది. 'బాగా సెప్పినావ్' మెచ్చుకుంది సన్నాసమ్మ.

తిరపతి అగ్గిఫైరయిపోయి ఊరికి బయల్దేరడానికి బట్టలేసుకు వచ్చాడు. 'అయాల మంటి బుక్కడమనుకున్నాను, కాదాడు వుల్లిబాము' అనీ అన్నాడు.

"నా మూలానే వచ్చిందీ జట్టీ..." తవిటయ్య గొణుగుతున్నాడు.

నరసమ్మా తిరపతీ ఊరికి బయల్దేరుతుంటే "మరి గొడవలొద్దురయ్యా, దాని పేనం ఇసిగిపోయింది. దయిర్యం సెప్పండి..." అంది సన్నాసమ్మ. ముసల్దీ మరికొందరూ అలాగే అన్నారు.

నరసమ్మ తిరపతీ వెళుతుంటే తవిటయ్య రెండడుగులు వేసి ఆగి నిలుచున్నాడు. వెనక్కి తిరిగి చూసిన తిరపతి 'వస్తావేట్రయ్యా' అని అడిగాడు. మామ ముఖం చూసిన నరసమ్మ ఏమర్థం చేసుకుందో 'రానీ'... అని మగడితో అని 'బేగిరా మావా' అంది. అంది. కోడలి మాటతో సత్తువ వచ్చిన తవిటయ్య అనుసరించాడు.

బస్సు దిగి అమ్మాయమ్మాల యిల్లు చేరేసరికి మధ్యాహ్నమయింది. ఇంటి ముందు బడ్డీకొట్టు మూసేవుంది. ఇంట్లో కూడా మనుషులు మసిలిన అలికిడి లేదు. చూస్తే ఒక మూలన అమ్మాయమ్మ తల ముడుకుల్లో పెట్టుకు కూర్చుంది. తలుపులు తెరిచిన అలికిడికి తలెత్తి చూసింది.

నరసమ్మ సంచిని ఒక మూలపెట్టి 'వొదినీ' అంటూ అమ్మాయమ్మకి దగ్గరగా వెళ్ళింది. చేతులు పట్టుకుంది. అమ్మాయమ్మ చిన్నగా ఒణికింది. కళ్ళలోకి దుఃఖం కన్నీరై ఉబికింది. 'వచ్చినారా... చూడ్డానికి వచ్చినారా.. ఈ నిప్పుల గుండం చూడ్డానికి వచ్చినారా?' మాటరాక వెక్కి వెక్కి ఏడ్చింది అమ్మాయమ్మ. నరసమ్మ ఎంత ఆత్మీయంగా స్పృజించినా ఆమె ఏడుపును ఆపలేకపోయింది.

తవిటయ్య కళ్ళొత్తుకుంటూనే ఏడుస్తూ ద్వారబంధం దగ్గర కూర్చుండిపోయాడు. తిరపతి నిశ్చేష్టుడై చేరగిలబడి నిల్చున్నాడు.

"ఏడకే... ఏడకమ్మా... వూరుకోయే.... ఆ సన్నాసమ్మ చెప్పిందాక తెలీలేదే..." ఓదార్చుతూ నొచ్చుకుంది నరసమ్మ. తన పమిటతో అమ్మాయమ్మ కళ్ళు తుడిచింది. విసనకర్రతో విసిరి శాంతపరిచింది.

కొద్దిసేపటికి దుఃఖం కుదిటపడి అమ్మాయమ్మకు మాటొచ్చింది. "నాకు కూతురూ లేదు. అల్లుడూ లేదు. చచ్చినారు..." అనేసి మళ్ళీ వలవల ఏడ్చింది. 'నాకు చావు లేదు' అంది, అనుకుంది. దుఃఖమాగింది.

"ఏరి?... ఏరీలు?........" అడిగాడు తిరపతి.

"అపునేరీలు, కనబడలేదు..." అటూ ఇటూ చూపు తిప్పి వెతికి అడిగింది నరసమ్మ.

వెంటనే అమ్మాయమ్మ "పోనీ.... ఎలగదెబ్బియిపోనీ... ముసిలోణ్ని మూలకం చూపించి అఖర్నజేసి నాయింటి నుండి నన్నేపొమ్మంటే నా నొప్పలేదు. నేనెక్కడికి పోయేది? అలయితే వయసులోటున్నారు. ఎటయినా పోగలరు. ఎగిరిపోగలరు. అందుకే ఆలనే పొమ్మన్నాను..." అని ఆగి, అంతలోనే ఏదో గుర్తొచ్చినట్టు "ఇది నాయిల్లు... ఆడిల్లట... నన్ను పొమ్మంటాడు... పోని నీను చచ్చిందాకా ఆగాలా?" చెప్పి ఆగింది.

"ఎక్కడికెళ్లినారు?..." అడిగాడు తిరపతి.

"ఈ ఊర్లోనే... బస్టాండు నుండి యింటి కొచ్చినపుడు చూడ్లేదా? ఈది గోర్జిలోనే కొత్తగా బడ్డీ కొట్టు ఎట్టుకున్నారు"... చెప్పింది అమ్మాయమ్మ.

తిరపతి అరుగు దిగి వెళ్ళబోతే అమ్మాయమ్మ వద్దని వారించింది. ఒట్టు వేయించుకుంది. ఎవరి బతుకులు వారివంది. నా బతుకు నాదంది. ఇప్పటికే పరువుపోయిందని, మళ్ళీ వీధిల పడే ఓపిక లేదని చెప్పింది. ఎవరితో దెబ్బలాడే శక్తి లేదంది. ఇంకా ఈ వూర్లో నీను బతకొద్దా? అని అడిగి తమ్ముణ్ని ఆపుచేసింది.

"ఇప్పుడెలగమరి?" నరసమ్మ అడిగింది.

'ఎలగంటే యేటి చెప్పేదొదినా? చచ్చేదాక బతకాలిగదా?!" అంది అమ్మాయమ్మ.

తిరపతి అప్పని తనతో ఊరు బయల్దేరమన్నాడు. అదే సబబని నరసమ్మ అదేమాట అన్నది. వూర్లోనే వుంటే కూతురుతో గొడవలొస్తాయనీ చెప్పింది అమ్మాయమ్మ.

"లేదు... పగోడయినా అల్లుడన్నట్టు ఎవులి బతుకు ఆలకే బారం. పిల్లకి తల్లి బారం. తల్లికి పిల్లబారం. ఎవులి బారం అలు మొయ్యడమే మంచిది. మిమ్మల్ని అన్నానని తప్పుపట్టకండి గాని ఒకసారి దెబ్బతినీసిన తర్వాత ఇంకెక్కడికీ రాను, రాలేను..." మళ్ళీ వివరించింది అమ్మాయమ్మ.

అమ్మాయమ్మ తన నిర్ణయం చెప్పాక ఎవ్వరూ ఇంకేమీ అనలేకపోయారు. కొద్దిసేపు నిశ్శబ్దం ఆవహించాక, అమ్మాయమ్మే వెళ్ళి బియ్యం పొయ్యి మీది పెట్టింది. నరసమ్మ కూరలు తరిగి వంటలో సాయపడింది.

అందరూ భోజనాలు చేసేసరికి సాయంత్రమయింది. కబురు తెలిసి అప్పుడుకప్పుడు అందరం వచ్చేసామని- యింట్లో ఎక్కడి వక్కడ వున్నాయని- చిన్న పిల్లలున్నారని- ఈ ఘోరం జరక్కపోతే ఈ వంటలతో తనొక్కదాన్ని వచ్చేదాన్నని- వెళ్ళక తప్పక బయల్దేరుతున్నామని- నరసమ్మ అమ్మాయమ్మని ఒప్పించి తిరుగు ప్రయాణానికి బయల్దేరింది.

నాల్రోజులయినా వచ్చుండమని తిరపతీ అన్నాడు. ఇప్పుడు కాదని యింకెప్పుడన్నా వస్తానని చెప్పింది అమ్మాయమ్మ.

'జకర్తమ్మా... జాకర్త...' అంతకు మించి ఏం చెప్పాలో తెలియని తవిటయ్య ఇంకేమీ చెప్పలేకపోయాడు.

తిరపతీ సన్నాసమ్మ ద్వారం దాటి అరుగు దిగుతుంటే తవిటయ్య తన అదీనంలో లేనట్టు వారి వెనకాలే అడుగులు వేసాడు.

నరసమ్మ వెనక్కి తిరిగి తవిటయ్యనిచూసి... "నువ్వెక్కడికి? వొదినిప్పుడు ఒక్కదాయి. అందులోనూ ఆడదాయి. కష్టమొస్తాది... సుకమొస్తాదీ.. చెయ్యికాపు మారుమనిషి లేకపోతే ఎలగువుతాది... బతుకు గడొద్దా?..." అంటూ వుండిపొమ్మంది.

అమ్మాయమ్మ అడ్డు చెప్పబోతే 'వొదినా... ఆశపడ్డాం గాని తీరింది కాదు. అయినా మా ఆశ కన్నా నీ ఆసరా ముఖ్యం. ముసిలోణ్ని నీతోటే వున్నీ.. మా పర్రాకులు మేం పడతాం, అవి ఎప్పుడూ వున్నివే..." నరసమ్మ అప్పటికే వచ్చిన తన నిశ్చయాన్ని తెల్పింది.

తిరపతి ఆశ్చర్యపడ్డాడు. ఆనందపడ్డాడు. పెళ్లాన్ని కళ్ళతోటే అభినందించాడు. తవిటయ్య రెండు చేతులూ ఎత్తాడు. వయసులో పెద్దయి కోడల్ని దీవించాడే గాని లేకపోతే దండమెట్టిడానికి కూడా వెనకాడే వాడుకాడు.

నరసమ్మ మర్చిపోయింది గుర్తుకు వచ్చినట్లు గబగబా యింట్లోకి వెళ్ళి కొన్ని పిండి వంటలు అక్కడే వదిలేసి, మిగిలినవి సంచితో పట్టుకుంది. తిరపతి అవి యింకా ఎందుకని అడగబోయి ఆగిపోయాడు.

అమ్మాయమ్మ తవిటయ్య చూస్తుండగానే- నరసమ్మ, తిరపతి వీధి చివర గోర్జీలో ఆగారు. కొత్తబడ్డీలో అమ్మాయమ్మ కూతురు కూర్చోని వుంది. చూడ్డంతో పలుకరింపుగా నవ్వింది తప్ప నోటితో పలుకరించలేదు. నరసమ్మ మటుకు సంచితో పిండి వంటలు బడ్డీలో పెట్టి "వంట్ల బాగుందే? జాకర్త... ఆఖరి బస్సుకు టైమయిపోయింది. ఎళ్తాం...." అనీసి ఆ పిల్ల నిండుపొట్ట వంక తృప్తిగా చూసి కదిలింది. ఆ పిల్ల గౌరవంగా లేచి నిలబడింది. తిరపతి మూగాడిలా పెళ్ళాన్ని అనుసరించాడు.

నరసమ్మ నడుస్తూ- దీర్ఘశ్వాస విడుస్తూ "చుట్టుతిరిగి మెట్టుతొవ కొచ్చినాం. ఎవులు బతుకుతోవ ఆలు నడక తప్పదు" అంది. ఆ మాట నిజమేనన్నట్లు మరోమాట మాటాడకుండా తిరపతి ఆమె వెంట నడిచాడు.

★ ★ ★

*ప్రచురణ : 21 మరియు 28 నవంబర్ '99 ఆదివారం ఆంధ్రజ్యోతి.*

*మలి ప్రచురణ : కథ - 99.*

*రచనా కాలం : 15 ఆగష్టు, 16 సెప్టెంబర్ '99.*